ప్రేమ-పెళ్లి

"నీరజా ! ఓ నీరజా ! యింకా రెడీ కాలేదూ! అవతల సినీమాకి టైము కావస్తోందోయ్ !"

ఆఫీసులోనే ఆలస్యం అయి యేకంగా రిక్షాకూడా తెచ్చి వాకిట్లో వుంచి మదన్ నీరజకోసం కేకపెట్టాడు. నీరజ వంట గదిలోని సామానులన్నీ పెరట్లో పడేసి బొద్దెంకలమీద దండయాత్ర చేసి నట్లుంది. తర్వాత యేమయిందో కానీ యెక్కడి సామాను అక్కడే వదిలి పడక కుర్చీలో పడుకుని పమిటచెంగు ముఖాన కప్పుకుని యేడుస్తోంది. కళ్ళు యెర్రగా వున్నాయి. ముఖం జిడ్డు కారుతోంది.

"మళ్ళీ యేమయింది?" విసుగ్గా అడిగాడు. అసలు యిలా నీరజని చూడటం పెళ్ళిఅయిన రెండు నెలల్లోనూ యిది అయిదోసారి

"వుత్తరం వచ్చింది" కళ్ళు తుడుచుకుంటూ అంది.

"యెక్కడనించి ?"

"యెక్కడనించో అయితే నే యేడవటం యెందుకూ ! మా చెల్లికి జ్వరంట. నా ఫ్రెండ్ రాసింది."

"యీ కాస్త విషయానికే యేడుపెందుకూ ! జ్వరంవస్తే అదే తగ్గుతుంది. అవతల సినీమాకి టికెట్లు రిజర్వేషన్ చేయిందాననీ, త్వరగా వస్తాననీ చెప్పి వెళ్ళానుగా !"

"నా మనసు బాగాలేదు."

"నా ఖర్మ, నీ మనసెప్పుడూ బాగోదు" తలకొట్టుకుని కోపంగా ఆ రిక్షావాడిని పంపేసి వంటగదిలో గిన్నెలన్నీ మూతలుతీసి చూసి ఛీ ఛీ ఆకలి మండిపోతున్నా యేంలేదు అనుకుని కాస్త "టీ" కాచుకుని తాగేసి యివతలకి వచ్చేసి సిగరెట్ వెలిగించుకున్నాడు. అయినా కోపం తగ్గటంలేదు మదన్‌కి. నీరజ కళ్ళు తుడుచుకుంటూ భర్తవైపు ఓ కంటితో చూస్తూనే వుంది. అతను వచ్చి ఓదార్చకపోయేసరికి దుఃఖం మరీ యెక్కువైంది

అసలు మదన్,నీరజా ఒకర్ని ఒకరు ప్రేమించుకుని పెళ్ళాడారు. యిద్దరి తల్లిదండ్రులూ యీ పెళ్ళికి అంగీకరించకున్నా "మా పెళ్ళి మా యిష్టం" అనీ ఒకర్ని ఒకరు వదిలి వుండలేమనీ పెదలకి తెలియకుండా గుళ్ళో పెళ్ళిచేసుకుని వుద్యోగానికి ట్రాన్స్ఫర్ చేయించుకుని దూరంగా వచ్చేశారు. మదన్ని స్నేహితులు చాలా అభినందించారు. "నువ్వే నోయ్ యీనాటి యువతరానికి ప్రతినిధివి, ఆశాకిరణానివి, ఆదర్శమూర్తివి" అంటూ పొగిడేశారు ఆనాడు జరిగిన విషయాలు తల్చుకుంటే మదన్‌కి యిప్పటికి గర్వంగా, తృప్తిగా వుంటుంది. పెద్దన్నయ్యలా పదివేలకి అమ్ముడుపోకుండా చిన్నన్నయ్యలా "మేనరికం" అంటూ చింతపండు రంగులోవున్న చిట్టిని పెళ్ళాడలా. తనని ప్రాణంకంటే యెక్కువ ప్రేమిస్తున్నా అని ప్రేమలేఖలు కురిపించిన ఒకప్పటి క్లాస్‌మేట్ నీరజని పెళ్ళాడేశాడు. కొత్త కాపురం పెట్టాడు. నీరజకోసం తల్లి దండ్రులకి దూరంఅయినా దిగులుపడ లేదు. పడకూడదు అని తనకి తను ధైర్యం చెప్పుకున్నాడు. కొత్తకాపురంలోకి కావల్సినవి ఒక్కొక్కటీ అమర్చుకోవటం మొదలెట్టాడు.

అయితే ఒక్కనెల చాలా సంతోషంగా గడిచిపోయింది. యింక నీరజలో ప్రతివిషయానికీ విపరీతార్థాలూ, విసుగూ మొదలైంది.

యిద్దరిలోనూ మనస్పర్థలు ప్రారంభమైనాయి. అవి చిలికి చిలికి గాలివానలా అవుతూన్నాయి, చిన్న కారణాలకే. యిలా జరక్కూడదని చాలా ప్రయత్నిస్తూన్నాడు కానీ నీరజకి బొత్తిగా బుద్ధి లేదు.

యీ పెళ్ళితో తనవాళ్ళు దూరమై

నారు అనే బాధేకానీ నా వాళ్లు దూరం అయారుగా అనే జ్ఞానం కాస్తన్నా లేదు. నాకుమాత్రం వాళ్ళ అందరినీ వదిలి వుండటం కష్టంగా లేదా!

యిలా ఆలోచించేసరికి నీరజమీద జాలి పోయి కోపం ముంచుకువస్తుంది.

నీరజ తండ్రికి గుమాస్తా వుద్యోగం అయినా అయిదుగురు ఆడపిల్లలు. తన లాంటి వరుడిని నీరజకి తేవాలంటే అధమపక్షం అయిదువేలన్నా "కట్నం" యివ్వకుంటే యీ పిల్లకి పెళ్ళి జరిగి వుండేదా! నీరజ అందంచూసి ప్రేమించాడు, పెళ్ళిచేసుకున్నాడు తను. యిందుకు మామగారికి కృతజ్ఞత లేక పోగా "మా అమ్మాయి భవిష్యత్తుని నాశనంచేశావు" అంటూ అర్థమైన మాటలూ అంటూ అవమానపర్చాడు. అంతే, యింక నీవాళ్ళు అనే వాళ్ళెవరూ యీ నా గడప తొక్కగూడదు! అనే శాడు మదన్.

''అలా అనకండి" అంటూ రెండు రోజులు వుపవాసం చేసింది నీరజ. అయినా మదన్ రాజీకి రాలేదు.

అప్పుడప్పుడూ నీరజ అమ్మా, నాన్నా, చెల్లెళ్లూ, తమ్ముళ్ళూ గుర్తొచ్చారు అంటూ భోరుమంటుంది. యింక ఆ రోజంతా యిద్దరికీ తిండీ, తిప్పలూ వుండవు. వండిన అన్నం తెల్లవారి అప్పలమ్మ సత్తు కారియర్‌లోకి వెళ్ళిపోతుంది

"నీరజా నేనసలే ఆకలికి ఆగలేను. నీవిలా చెయ్యకు. నిన్ను వదిలి నే నొక్కడినే కడుపునింపుకునే కసాయి వాడిని కాను" అని ఒకసారి కాదు వంద సార్లు చెప్పాడు నెమ్మదిగా. అప్పుడు మాత్రం "సరే" అని గొర్రెపొట్టేల్లా తల ఆడించేస్తుంది. కానీ సమయంవస్తే మామూలే.

నీరజ మదన్‌ని ప్రేమించింది. కానీ అతని అలవాట్లూ, మాటలూ కొన్ని నచ్చవు పైగా అసహ్యాన్ని కల్గిస్తాయి. మదన్ ఆఫీసులో పనిచేసే అమ్మాయిలని వెంటేసుకుని సినీమాలకీ, షికార్లకీ అంటూ తిరుగుతూ డబ్బు ఖర్చుపెట్టటం అస్సలు నచ్చదు ఒకప్పుడు యీ అల వాట్లకే ఆకర్షితురాలై పెళ్ళాడినా యిప్పుడు వాటిని భరించలేకపోతోంది పైగా అసహ్యాన్ని పెంచుకుంటూ వుంది లోలోపల.

యిద్దరి మనస్సుల్లోనూ అప్పు డప్పుడూ యిలాంటి భావనలు కల్గినా ఆవేశపడిపోయినా తర్వాత యెవరో ఒకరు రాజీకి వస్తూ రెండు నెలలు గడిపేశారు.

"అసలీ పెళ్ళిచేసుకోవటంలో పొర పాటు చేశానా!" అని తనలో తను మధనపడిపోతూ వుంటాడు మదన్, తన వాళ్ళ యోగక్షేమాలు తెలియక ఆరాట పడేప్పుడు.

మదన్‌కి నీరజ ఒకప్పుడు ప్రేమ



స్వరూపిణిగా మరొకప్పుడు సత్యభామలా యింకోప్పుడు శూర్పణకలా రకరకాలుగా కన్పిస్తూవుంటుంది

"యివన్నీ మీ వూహలే కానీ నేనెప్పుడూ ఒకేలా వున్నాను" అంటుంది మదన్ తన భావాలని బైట పెట్టినప్పుడు.

"కాదు. నీకు ముక్కుమీదే వుంటుంది కోపం. ఆడపిల్లకి అంత కోపం తగదు" అంటాడు శాంతంగా.

"అది నా స్వభావం చస్తే పోదు" అంటుంది

"మార్చుకుంటే అన్నీ పోతాయి. ప్రయత్నించు" అంటే చాలు కోపం వచ్చేస్తుంది నీరజకి. "నాకేం అవసరం లేదు, రాదు ! చస్తే మార్చుకోను..."

తనే నీరజని నమిలి మింగేయాలన్నంత కోపం వస్తున్నా మింగేసి "ఖర్మ" అని జుట్టు పీక్కుని ఆ రాత్రి భోజనానికైనా పిలవని భార్యని "రాక్షసి" అనుకుంటూ తెల్లవార్లూ జాగారంచేస్తాడు. కానీ నీరజ నిశ్చింతగా నిద్రపోతుంది, తను ఒక్కర్తీ హాయిగా అన్నం తిని

యింక తెల్లవారి లేచి ఫిల్టర్ డికాషన్‌తో చిక్కటి కాఫీ తాగేసి యింకా నిద్రలేవని మదన్‌ని "యీవాళ ఆదివారం కాదు అయ్యగారూ ! ఆరుగంటలైంది లేవండి" అని వంటయింట్లోనించే గావుకేకలు పెడుతుంది.

రాత్రి అంతా జాగారంచేసి తెల్లవారుఝామున కాస్త కునుకుపడితే అప్పుడే లెమ్మని గోలచేసే నీరజని యేం చెయ్యాలో అర్థంకాదు. పోనీ బద్ధకంగా లేచి కాఫీ తాగి వాలుకుర్చీలో కూర్చుంటే,

"చింతపండు కావాలి ! చీపురుకట్ట

కావాలి ! కూరలు కావాలి" అంది గోడతో మాట్లాడుతూన్నట్లుగా.

"పెళ్ళిచేసుకున్నంత బుద్ధి తక్కువ లేదు" అనుకుంటూ బట్టలు వేసుకుని సైకిల్ తీసుకుని బజారు బయలుదేరాడు మదన్. కావల్సినవి తీసుకుని ఆఖరున చీపురుకట్టలు చూస్తూంటే ఆఫీసులో టైపిస్టు మేరీ కన్పించింది.

కబుర్లుచెప్తూనే "మదన్‌గారూ ! మీకూ చీపుళ్ళూ, చింతపండూ కావాలా ?" అంది అదోలా నవ్వుతూ.

"అంటే" యెదురుప్రశ్న వేశాడు.

"అహ యేంలేదు ప్రేమ వివాహం కదూ ! ఆకలిదప్పులు వుండవేమో అనీ గాలి పీలుస్తూ, ప్రేమగీతాలు పాడు కుంటూ బ్రతుకుని గడిపేస్తారేమో అనీ..." సాగదీస్తూ అంది మేరీ.

యీలాంటి మాటలు వింటే యిది వరకైతే పొంగిపోయేవాడు. కానీ యీవాళ మాసినగడ్డాన్ని యెడంచేత్తో రాచుకుంటూ "చూడండి. ప్రేమవివాహం అయినా కాకున్నా ఆ తర్వాతి జీవితాలు అందరివీ ఒక్కలానే వుంటాయేమో!"

"అంతేనంటారా !" అని వాచీ చూసుకుని మేరీ టైము అయింది అని వెళ్ళిపోయింది.

మదన్ యింటికి వచ్చేసి సంచీ భార్యకిచ్చి గడ్డం చేసుకునేందుకు అద్దం తీసుకుంటూ వుంటే "మార్కెట్లో కోతు లాడుతున్నాయా ! యీ రెండూ తేవటానికింతసేపూ ;" అంది నీరజ కోపంగా.

మదన్ కోపంవస్తూన్నా మింగుతూ, "టైము చాలా అయింది యింకా వేస్టు చెయ్యకు" అన్నాడు.

"తొమ్మిదింటికి కూరలు తెచ్చి నా ముఖానవేసి అర్ధగంటలో అన్నంపెట్టు అంటే నేనేం సతీ అనసూయనా ! యీ ముదురు బెండకాయలన్నీ క్షణంలో వుడికించెయ్యటానికి" అంది కోపంగా చేతులు చాస్తూ.

"నువ్వు గృహిణివి కావూ, అర్ధ గంటలో వంటచెయ్యలేవూ ?"

"నేను ముందు ప్రియురాలిని. కనుకనే పదండి పోదాం హోటల్‌కి. సాయంత్రం తీరిగ్గా వేయిస్తాను బెండ కాయ వేపుడు" వేపుడు అంటూ వత్తి పలికింది.

"యీలాంటి మాటలు ఆ మూడు ముళ్ళూ పడకముందు అంటే నాలాంటి ప్రతి వెధవా కాబూలీవాలా దగ్గరైనా డబ్బుతెచ్చి "ఆటో"లో హోటల్‌కి తీసుకువెడతాడు. కానీ నువ్వు సాక్షాత్తూ గృహలక్ష్మివి. కనుక వెంటనే పప్పు పులుసు చెయ్యలేకుంటే నేవేసిన మూడు ముళ్ళకి సార్ధకత వుండదు"

"మూడు ముళ్ళకి మరో పదిముళ్ళూ వెయ్యండి యీ తాడుతోనే. యింక "వురి" అక్కర్లేకుండా చచ్చి వూరు కుంటాను. పావుగంటలో పదిరకాలు

వండి వడ్డించటం నా తరంకాదు. అయినా యింత తిండిపోతుతనం యేమిటీ! గతిలేనివాళ్ళలా."

"యేంకూశావే! నే తిండిపోతునా?" చర్రున లేచాడు మదన్.

"........"

"మీరు తిండి తినరూ! పస్తుంతో వస్తారా!' ఆవేశంగా అరిచి స్నానానికి వెళ్ళిపోయాడు.

బట్టలు వేసుకుని ఆఫీసుకి బయలు దేరుతూంటే నీరజ మెల్లగా అంది.

"వంట అయింది, వడ్డించాను" అని.

మదన్ కోపం మంచులాగా కరిగి పోయింది. ఛీ నీరజని యేం అనకూడదు అనుకుంటూ భోజనంచేసి ఆఫీసుకి వెళ్ళి పోతూ చెప్పాడు

"త్వరగా వస్తాను, రెడీగా వుండు. సినీమాకి పోదాం! నీ ఆరాధ్య 'హీరో' పిక్చర్ కి టికెట్లు రిజర్వేషన్ చేయించేసి మరీ వస్తాను!"

యీ మాటకి నీరజ ముఖం వికసించింది. అది చూసి వుత్సాహం తెచ్చుకుని ఆఫీసుకి వెళ్ళిపోయిన మదన్ ఆఫీసు లోనే అలస్యం అయిపోయిందంటూ రిక్షాలో వస్తే నీరజ తనవాళ్ళకి బాగా లేదని యేడుస్తూ కూర్చోవటంతో అశాంతీ, అసహనంతో వీగిపోయాడు మదన్. యిప్పుడేం చెప్పినా ప్రయోజనం వుండదు అని బాగా తెల్సు.

"ఖర్మ ఖర్మ" నెత్తికొట్టుకున్నాడు. కోపాన్ని తగ్గించుకోవాలని ప్రయత్నిస్తున్నాడు.

రాత్రి తొమ్మిదింటివరకూ చూసినా నీరజ లేచి వంట ప్రయత్నం చేసేలా కన్పించలేదు. బ్రతిమిలాడాడు "నే వండను, తినను" అంది దుప్పటిముసుగు బిగించి.

మదన్ ఆకలి భరించలేక అలా అని నీరజని వదిలి తను తినలేక కళ్ళు మూసుకుని పడుకున్నాడు

తెల్లవారింది

"వంట అయింది భోజనం చెయ్యండి" అని నీరజ పిలిస్తే బాగుండు అనుకుని చాలాసేపు చూశాడు. అవతల ఆఫీసుకి టైముఅయిపోతూవుంది తనే "వంట అయిందా!" అని అడగాలి అని అనుకుని "అహం" అడ్డువచ్చి ఆకలి తోనే వెళ్ళిపోయాడు.

ఆఫీసులోనూ శాంతిలేదు. తలనొప్పి పగిలిపోతోంది. కాఫీ తాగినా తగ్గలేదు నీరజ ఒక్కోప్పుడు యిలా చేస్తూ వుంటుంది యెందుకూ? అని ఆలోచిస్తూంటే యేవేవో గుర్తుకి వస్తూన్నాయి. ఒకటి రెండుసార్లు సిగరెట్ పీకెలు కన్పించాయి. అవి తను వాడేవి కావు! యెవరో కొత్త వ్యక్తి వచ్చి వుండాలి! నీరజకి అంత సన్నిహితు లెవరు!

ఛీ యీలాంటి అనుమానం పెట్టుకో కూడదు. నూరేళ్ళు కల్సి బ్రతకవల్సిన

జీవితాలు. నేనిలావచ్చానని నీరజ బాధ పడిపోతూ అన్నం మానేస్తుందేమో. నన్ను తన ప్రాణంకంటే యెక్కువగా ప్రేమించిన నీరజకి యెంత అన్యాయం చేస్తూన్నాను ! యీ రోజునించీ యిలా చెయ్యను. అనుకుని శలవుపెట్టి యింటికి వచ్చేశాడు. వీధి తలుపు తోసుకుని రాబోతూంటే పడక గదిలోంచి మాటలు విన్పిస్తూంటే ఆశ్చర్యపోతూ అక్కడే ఆగిపోయాడు.

''నీరూ మదన్‌కి బాగా టోపీ వేసేశాం కదూ ! యీ కరువుకాలంలో ఆడపిల్ల పెళ్ళి అంటే మాటలా ! కనీసం కట్నం అయిదువేలూ, ఖర్చు అయిదు వేలూ అయినా కావాలి ! ప్రేమించానని పెళ్లాడి మమ్మల్ని రక్షించావు లేకుంటే అప్పులపాలు అయిపోయివుండేవాళ్ళం. నీకులానే మన "రమ''కి ఓ ఇంజనీరు ఫ్రెండ్‌ని చూపాను. అది వట్టి చవట ముఖం. ఆతనితో సినీమాలూ, షికార్లూ చేసి పెళ్ళి విషయం తేల్చుకోక "కడుపు" తెచ్చుకుని మా ప్రాణం మీదకి తెచ్చింది. దరిద్రగొట్టు ముఖంది."

నీరజ అన్న శ్రీహరి గొంతు అది.

''ఆయ్యో ! యిప్పుడెలా ! అతన్ని వదలకండి.''

"ఆతను మదన్‌లాంటి పిచ్చివాడు కాదు. 'ఛీఛీ పొండి' అని ఛీకరించి నన్ను మెడపెట్టి గెంటించేశాడు. అన్నట్లు నాక్కాస్త డబ్బు కావాలమ్మా. చాలా అవసరం. నాకు పిల్లని యిస్తాం అని వచ్చారు. పదివేలకి కట్నం పైసె తగ్గను అని చెప్పేశాను. "సరే" అన్నట్లే వాళ్ళు. అన్నట్లు నిన్న నే తెచ్చిన స్వీట్లు అతనికిగాని పెట్టలేదు కదా ! నీవంత తెలివితక్కువదానివి కాదులే !''

''అవన్నీ సరేగానీ నా దగ్గర పైస లేదు. ఆయన ఒట్టి పీనాసి. పైస యివ్వరు. నా కసలు విసుగ్గా వుందీ కాపురం."

"అయ్యో అలా అని కాపురం వదిలి రాకే తల్లీ!'' గాభరాగా అన్నాడు.

యింక వాళ్ళ మాటలు వినే సహనం లేక గభాలున తలుపు తోసుకుని గది లోకి వచ్చాడు మదన్. శ్రీహరి తృళ్ళి పడి లేచి నిల్చున్నాడు. నీరజ వణికి పోయింది. ''మీరు ... వచ్చేశారేం ?'' అంది యెలాగో గొంతు పెగుల్చుకుని.

యెందుకు వచ్చానా! మీ అంతు చూడ టానికి" అంటూ శ్రీహరి షర్టుపట్టుకుని ఒక్క గుంజు గుంజి యేంరా ! చెల్లె ళ్ళని యెరగాపెట్టి నాలాంటివాళ్ళని వలలో వేసుకుని మా యిల్లు గుల్లచేద్దాం అని వచ్చావా !

మీ బోడి తెలివి నా దగ్గర పని చేసింది కాని ఆ ఇంజనీరు మీకు బాగా బుద్ధి చెప్పాడుగా. గుర్తువుంచుకుని మరెప్పుడూ బుద్ధితక్కువ పనులు చెయ్య



కంది డబ్బులేకున్నా మంచి మనస్సు వుంచుకోవాలి అదీ లేదు మీకు, అని యిప్పుడు తెల్సింది. ఛీఛీ...నా జీవితం నాశనం చేసుకున్నాను నువ్వు చెల్లెలిని దొంగతనం కూడా చెయ్యమని ప్రార్థిస్తున్నావా ?'' గద్దించి అడిగాడు.

"బావగారూ ! మీరు ... పొరబడుతూన్నారు...మీ కాపురం యెలా వుందో చూసిపోదాం అనే వచ్చాను అంతే ... అంతే ...'' యింకా యేదేదో చెప్పబోతూన్న శ్రీహరిని మెడపట్టుకుని వీధిలోకి నెట్టేసి తలుపు ఘడియ బిగించేశాడు

"యిప్పుడు చెప్పు. నీ విషయం... నన్ను ...కట్టుకున్న భర్తని మోసగించాలని ప్రయత్నిస్తావా ? నువ్వు ఆడదానివేనా ? చెప్పు."

"........."

''నేనూ నా అలవాట్లూ నచ్చకుంటే నిర్భయంగా చెప్పి నీ దారిన వెళ్ళిపో. కానీ యిలా దొంగనాటకాలు ఆడకు... తెల్సిందా ? చెప్పు. యిక్కడ వుండటం యిష్టం వుందా ? లేదా ? చెప్పు, జవాబు చెప్పు."

''........."

"నీ పద్ధతులు యెన్నో నాకు నచ్చకున్నా భరించటంలేదూ ?''

"........."

"పెళ్ళికాకముందు నీవు లేకుండా బ్రతకలేను అని చెప్పిన నీకు యిప్పుడేమయింది ?

నీ కోసం నా వాళ్ళందరినీ వదులుకోలేదూ ? మాట్లాడవేం ?'' మదన్‌కి కోపంతో పళ్ళు దవిస్తూన్నా నీరజ

సరిగా ఒక్కమాట మాట్లాడితే చాలు చల్లబడిపోయేవాడు. కానీ నీరజ మొద్దులా నిల్చుంది అలా నిల్చో వటంలో భయంకాదు. తనంటే తేలిక భావం వుందని తెల్సి భరించలేక ఆవేశ పడిపోతూన్నాడు మదన్. అందుకే రెట్టించి అడిగాడు.

"నాకు నావాళ్ళుకూడా కావాలి" అంది.

"అయితే వాళ్ళదగ్గరకే వెళ్ళు" మదన్ నీరజని రెక్కపట్టుకుని వీధిలోకి తోయబోతూంటే నీరజ గుంజుకుంది

"నా యిష్టంలేకుండా ఒక్కక్షణం యిక్కడ వుండటానికి వీల్లేదు" అంటూ ఆవేశంగా అవతలికి తోసేసి నీరజకి సంబంధించినవి పెట్టే, బట్టలూ వీధిలోకి విసిరేస్తూన్నాడు. నీరజ రాయిలా నిల్చుంది.

యింతలో యింటిముందు రిక్షా ఆగింది. అందులోనించి మదన్ తాత గారూ, నాయనమ్మా దిగారు. సత్తు గిన్నెలో నెయ్యీ, వేరుసెనక్కాయల మూటా, బెల్లం అరిసెలూ నువ్వు లుండలూ, అప్పడాలూ వడియాలూ యిలా యెన్నెన్నో మూటలు కట్టుకుని మనవడి కొత్తకాపురం చూడాలని రైలు దిగి రిక్షాకట్టించుకుని యిక్కడికి వచ్చారు అసలు మదన్ తాతగారు సీతారామయ్యకీ, కొడుక్కీ మదన్ పెళ్ళి విషయం గురించి చాలా ఘర్షణ అయింది

"నా పరువు తీశాడు నీ ముద్దుల మనవడు" అని తండ్రి అంటే యింక తాతగారు "పోనివ్వు. కోరిన పిల్లని కట్టుకుని సుఖంగా కాపురం చేసు కుంటాడు. నూరేళ్ళ దాంపత్యం సుఖ సంతోషాలతో వెల్లివిరియాలి కానీ నీకు కట్నం డబ్బు పోయిందని దిగులు పడతావేం పోతేపోయింది," అనేశాడు ముసలాయన. యింక మదన్ తండ్రి మండిపోతూ "నీ గారాబమే వాడిని పాడుచేసింది. నేనంటే విలువలేకుండా చేసింది. నలుగురిలో తలెత్తుకోకుండా చేశాడు అప్రాచ్యుడు. వెధవ ముంత" అంటూ "వాడింక నా యింట్లో కాలు పెట్టటానికి వీల్లేదు" రంకెలు వేశాడు.

ముసలాయన ఓ నెల చూశాడు రెండు నెల్లు చూశాడు. అంతే. భార్యతో బయలుదేరాడు. వాడు నీ గడపతొక్క వద్దు అన్నావుగా మేమే వాడిని చూస్తాం అని వచ్చేశాడు. వస్తూ మనవడికి యిష్టం అయినవన్నీ మూటలు కట్టుకుని వస్తే యిక్కడ యిలా వుంది ముసలి వాళ్ళిద్దరూ మొదట తెల్లబోయి ఆపైన సర్దుకుని ఒకరి ముఖాల్లోకి ఒకరు చూసుకుని,

"ఒరే మదన్" అని కేకపెట్టాడు తాతగారు! మదన్ కలగంటూన్నానా అని క్షణం భ్రాంతపడి యింతలోనే

"తాతయ్యా, నానమ్మా" అంటూ అమాంతం వచ్చి యిద్దరినీ వాటేసుకున్నాడు. "నానమ్మా నేనంటే మీ కోపంలేదూ!" అన్నాడు.

"నీ ముఖం కోపం యెందుకురా!" అంటూ విగ్రహంలా నిలబడ్డ నీరజ చెయ్యిపట్టుకుని లోపలికి తీసుకు వస్తూంటే "వద్దు, దాన్ని లోపలికి తీసుకు రావద్దు నానమ్మా" అన్నాడు ఆవేశంగా.

'ఒరే ఒరే అటు చూడు, వీధిలో యెందరు చూస్తూన్నారో నీ వైపు. యేదైనా విషయం వుంటే భార్యాభర్తలు వీధిలోనుంట్రా పరిష్కరించుకునేదీ! అయినా పెళ్ళిఅయి పట్టుమని పదినెలలు కాలేదు. అప్పుడే యిదేమిటీ, సరే... యిప్పుడు నువ్వేం చెప్పకు. ముందు స్నానం, భోజనం కానిచ్చిగానీ తాపీగా వినం" అన్నారు యిద్దరూ యేక కంఠంతో.

నీరజ "అమ్మయ్య" అనుకుని లోపలికివెళ్ళి చకచకా చేసేస్తోంది వంట.

"పిల్ల లక్ష్మిలా వుంది" నానమ్మ ప్రశంశాపూర్వకంగా చూస్తూ అంది మనవడితో.

''వుంది కానీ గుణం లేదు."

"నీ ముఖం. అవన్నీ నే నేర్పిస్తారా పిచ్చి సన్యాసీ. చూడు. కొన్నాళ్ళు వుంటాంగా అంది" ముసిముసి నవ్వులు నవ్వుతూ.

ఆ తర్వాత తాపీగా మనవడూ, మనవరాలూ చెప్పినవన్నీ విన్నారు. మౌనంగా వూరుకుని మనవడు లేకుండా నీరజని పిల్చి మెత్తగా చివాట్లు పెట్టింది నానమ్మ. "పెళ్ళి అయిన యే ఆడదాని కైనా అందరికంటే ముఖ్యుడు మొగుడు తల్లీ! అతని జీవితంలో భాగం పంచుకుని యిల్లుని 'స్వర్గం' చేసుకుని ఆ తర్వాత మిగతా అందరి విషయమూ ఆలోచించాలే పిచ్చి పిల్లా! మా మదన్‌ది వెన్నలాంటి మనస్సు. యిలాంటివాడు దొరకటం నీ అదృష్టం. వాడూ అచ్చంగా వాళ్ళ తాతగారి పోలిక. అలవాట్లూ అవే చూడమ్మా జీవితంలో చిన్న విషయాలకే అయినా పట్టుదలలూ, పంతాలూ భర్తతో కాదు ''

యింక తాతగారు మనవడిని దగ్గర కూర్చోపెట్టుకుని,

"నీ సెలక్షన్ అద్భుతంరా మదన్! కానీ ప్రేమించాను, పెళ్ళాడాను ... అనగానే జీవితంలో సంతోషం రాదురా! చూడూ మీకు ఒకర్ని ఒకరు అర్థం చేసుకునే అవకాశాలు యెక్కువ వున్నాయి. ఒకరి బలహీనతలని ఒకరు సర్దుకుంటూ వుండాలి. దాంపత్య జీవితం అంటే నూరేళ్ళ పంట. యీ జీవితాన్ని ఆదర్శవంతంగా, అందంగా మల్చుకోవటం మనచేతుల్లోనే వుంటుంది. అయితే దీనికి శాంతం కావాలి.

"యింకా యింకా చెప్తున్నాడు తాతయ్య.

లోపల నీరజకి నానమ్మ మల్లె మొగ్గలు పెట్టి వంకీలజడ వేసింది. తమరు తెచ్చిన తెల్లజరీ చీరె కట్టించింది. అద్దంలో ఒక్కసారి చూసుకో అంటోంది. నీరజ అద్దంలో ముఖం చూసుకుంటూ వుంది. అయితే అక్కడ తన ప్రతిబింబం కాక మదన్ ముఖం కన్పిస్తోంటే ఆశ్చర్యంగా ఆ ముఖాన్ని తదేకంగా చూస్తూ వుంది. నీరజ ముఖం చిరునవ్వుతో విచ్చుకుంది.

స్త్రీ పురుషుల ఆకర్షణతో ప్రారంభమైన దాంపత్య జీవితం గృహభారాన్ని వహించి కష్టసుఖాలు పంచుకుంటూ తర్వాత వార్ధక్యంతో స్నేహితుల్లా మిగిలిపోతారు.

తాతయ్య వీళ్ళిద్దరినీ చూస్తూ తనలో తను అనుకుంటూ నవ్వుకుంటూ కళ్ళజోడు పెట్టుకుని భగవద్గీత చదువుకోవటంలో మునిగిపోయాడు.